# సాక్షి కామారెడ్డి

మంగళవారం । 12 । మార్చి । 2024




## ఫిర్యాదులు పరిష్కరించాలి

ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ పాటిల్ ఆదేశించారు.

- 8లో ▸




గరిష్ఠం/కనిష్ఠం
37.3 /20.9

## వాతావరణం

ఉదయం చలిగాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరుగుతుంది. రాత్రి ఆకాశం నిర్మలంగా ఉంటుంది.

## న్యూస్‌రీల్

### ధరణి సమస్యలు త్వరగా పరిష్కరించాలి

- అధికారులకు ఎమ్మెల్యే కేవీఆర్ ఆదేశం



కామారెడ్డి టౌన్: నియోజకవర్గంలోని రైతులకు సంబంధించిన ధరణి సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి రెవెన్యూ అధికారులకు సూచించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రైతులకు ఇబ్బంది లేకుండా పారదర్శకంగా చర్యలు తీసుకోవాలన్నారు. భూ తగాదాలకు తావు ఇవ్వొద్దన్నారు. రైతుల నుంచి వినతులను తక్షణమే పరిష్కారం చూపాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

### ప్రతి ఎకరానికి సాగు నీరందేలా చర్యలు

- ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి



బాన్సువాడ: నిజాంసాగర్ ఆయకట్టు పరిధిలో గల ప్రతి ఎకరానికి సాగునీరందేలా చర్యలు తీసుకుంటున్నామని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన బీర్కూర్ నల్లచెరువు తూమును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాంసాగర్ ఆయకట్టు కింద యాసంగిలో అలీసాగర్ వరకు లక్షా 30వేల ఎకరాలకు సాగునీరందించడానికి ప్రణాళిక తయారు చేశామని, ఏడు విడతలుగా నీటిని నిజాంసాగర్ ప్రధాన కాలువ ద్వారా సరఫరా చేస్తున్నామన్నారు. ప్రస్తుతం ఆరో విడత నీటి విడుదల కొనసాగుతుందని తెలిపారు. బీర్కూర్ నల్ల చెరువు కింద 650 ఎకరాల ఆయకట్టు ఉందని, చెరువు తూములో ఏదో ఇరుక్కుపోవడంతో నీళ్లు బయటకి రావడం లేదన్నారు. అధికారులతో మాట్లాడానని, నీటి అడుగున చెత్త, ఇతర అడ్డంకులను శుభ్రం చేయడంలో నిపుణులను పిలిపించి సమస్యను పరిష్కరిస్తున్నామని తెలిపారన్నారు. ఎకరం కూడా ఎండిపోకుండా చూస్తామని, రైతులు ఆందోళన చెందవద్దని సూచించారు. ఆయన వెంట ఎంపీపీ రఘు, ఎంపీటీసీ సందీప్, నాయకులు అవారి గంగారం, పోగు నారాయణ, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

### ఉన్నత ప్రమాణాలు పాటించాలి



కామారెడ్డి అర్బన్: న్యాక్ ఏ గ్రేడ్‌తో పాటు స్వయంప్రతిపత్తి హోదా కలిగిన కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఉపాధి ఆధారిత కోర్సులతో పాటు నాణ్యత ప్రమాణాలను పాటిస్తోందని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కళాశాలలో అత్యధికంగా విద్యార్థులు చేరేలా ప్రచారం చేయాల సూచించారు. సోమవారం కలెక్టర్ చాంబర్‌లో కళాశాల ప్రచార కరపత్రాలను కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ విజయ్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ కిష్టయ్య, ఐక్యూఏసీ, అకడమిక్, పీజీ సమన్వయకర్తలు చంద్రకాంత్, శంకరయ్య, రాజ్‌కుమార్, పరీక్షల నియంత్రణ అధికారి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించిన ఎస్పీ



కామారెడ్డి క్రైం : జిల్లా పోలీసు కార్యాలయం ఆవరణలో ఎస్‌ఆర్ ఫౌండేషన్ వారి సహకారంతో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఎస్పీ సింధు శర్మ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సిబ్బంది అవసరాల నిమిత్తం ప్లాంట్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రెయినీ ఐపీఎస్ కాజల్ సింగ్, ఏఎస్పీ నర్సింహా రెడ్డి, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.



బెజుగం తండాలో బోర్లల్లో నీరు అడుగంటడంతో ఎండిపోయిన వరిపంట

# చి'వరి'కి మేతయ్యింది

- బోర్లు వట్టిపోవడంతో ఎండుతున్న పంటలు

ఎండల తీవ్రత క్రమంగా పెరుగుతుండడంతో ఆరుగాలం కష్టపడి సాగుచేసిన వరి పంటలు ఎండిపోతున్నాయి. నాగిరెడ్డిపేట మండలంలోని బెజుగం చెరువు తండాలో ఎండుతున్న పంటలను బాధిత రైతులు పశువులు, మేకలతో మేపుతున్నారు. తండాకు చెందిన అంగోత్ చాందిరం తనకున్న సుమారు ఎనిమిది ఎకరాల్లో వరి పంటను సాగు చేశాడు. కాగా ఉన్న రెండుబోర్లు పూర్తిగా అడుగంటడంతో చేసేదేమిలేక ఎండుతున్న పంటను పశువులతో మేపుతున్నాడు. ఇదే తండాకు చెందిన మరో రైతు అంగోత్ రుక్కికి చెందిన వ్యవసాయ భూమిలో వరి పంటను సాగు చేసింది. కాగా పొలంలోని బోరులో నీరు అడుగంటిపోవడంతో పంట పూర్తిగా ఎండిపోయింది. దీంతో వరిసాగును ఆమె అర్ధాంతరంగా వదిలేసింది.

–నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి)



ఎండిన వరిపంటను మేస్తున్న మేకలు, పశువులు



# పొలిటికల్ హీట్..

## గరంగరం.. కామారెడ్డి రాజకీయం!

- పట్టుకోసం ప్రయత్నిస్తున్న షబ్బీర్ అలీ
- ప్రొటోకాల్ ఉల్లంఘనలపై ఎమ్మెల్యే కాటిపల్లి ఫైర్
- మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసానికి కాంగ్రెస్ నోటీసు
- వలసలు, కుమ్ములాటలతో బీఆర్‌ఎస్‌లో ఆగమాగం




సాక్షి, కామారెడ్డి: అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత కామారెడ్డి నియోజకవర్గంలో రాజకీయాలు తారుమారయ్యాయి. బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌ల నుంచి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిలు పోటీ చేయగా వారిద్దరి మధ్య బీజేపీ నుంచి పోటీ చేసిన కాటిపల్లి వెంకటరమణారెడ్డి విజయం సాధించారు. దీంతో నియోజకవర్గ రాజకీయాలు రంజుగా మారాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టడంతో నియోజకవర్గానికి చెందిన మాజీ మంత్రి షబ్బీర్ అలీకి ప్రభుత్వ సలహాదారు పదవి వరించింది. దీంతో ఆయన నియోజకవర్గంలో పట్టుకోసం ప్రయత్నిస్తున్నారు. జిల్లా యంత్రాంగం మొత్తం ఆయన చుట్టూ తిరుగుతుండడంతో ఇతర పార్టీల్లోని ప్రజా ప్రతినిధులు, నేతలు కూడా కాంగ్రెస్ గూటికి చేరుకుంటున్నారు. ప్రభుత్వంలో షబ్బీర్ అలీ ప్రాధాన్యతను గమనించిన జిల్లా అధికారులు కూడా ఆయన కంట్రోల్‌లోకి వెళ్లిపోయారు. దీంతో నియోజకవర్గంలో ప్రొటోకాల్ సమస్య మొదలైంది. ఇటీవల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో పైఅంతస్తు ప్రారంభోత్సవ కార్యక్రమం విషయంలో వివాదం తలెత్తింది. నియోజకవర్గ ఎమ్మెల్యేగా తనకు తెలియకుండా జిల్లా ఇన్‌చార్జి మంత్రితో కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడంపై ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి జిల్లా అధికారులను నిలదీశారు. ప్రొటోకాల్ పాటించకుండా ఏ ప్రొటోకాల్ లేని వ్యక్తులకు ప్రాధాన్యతనిస్తున్నారంటూ అధికారులపై మండిపడ్డారు. దీంతో మంత్రి పర్యటన రద్దయ్యింది. ఇదే సమయంలో ఎమ్మెల్యే జిల్లా ఆస్పత్రికి వెళ్లి అధికారులను నిలదీశారు. ప్రొటోకాల్ ఉల్లంఘనపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని పేర్కొన్నారు. అయితే అదే రోజు ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ కలెక్టర్‌తో కలిసి ఆస్పత్రిలో పైఅంతస్తును ప్రారంభించారు. కాగా ఎమ్మెల్యే అభివృద్ధిని అడ్డుకుంటున్నాడని, కామారెడ్డికి శనిలా దాపురించాడంటూ డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్ తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రొటోకాల్ విషయంలో బీజేపీ, కాంగ్రెస్ మధ్య మొదలైన వివాదం ముదురుతోంది. కాగా ఎమ్మెల్యేగా వెంకటరమణారెడ్డి విద్య, వైద్యంపై ఫోకస్ చేశారు. ఇప్పటికే ఆస్పత్రిని తనిఖీ చేసి తనదైన శైలిలో అధికారులకు వార్నింగులు ఇచ్చిన ఎమ్మెల్యే, పలు స్కూళ్లను తనిఖీ చేసి ఉపాధ్యాయుల గైర్హాజరు అంశాన్ని సీరియస్‌గా పరిగణిస్తున్నారు. పాఠశాల హెడ్‌మాస్టర్లు, క్లస్టర్‌హెడ్ మాస్టర్లతో మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. అలాగే ధరణిపై రెవెన్యూ అధికారులతో సోమవారం సమీక్షించారు.

### బీఆర్‌ఎస్ నుంచి ఒక్కొక్కరుగా వీడుతూ..

పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ పార్టీలో నాయకుల మధ్య ఆధిపత్యపోరు కొనసాగుతోంది. ఈ నెల 10న జరిగిన కార్యకర్తల సమావేశంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలోనే నాయకుల మధ్య విభేదాలు బహిర్గతమయ్యాయి. కాగా బీఆర్‌ఎస్‌కు చెందిన కౌన్సిలర్లు దాదాపు ఇరవై మంది పార్టీ వీడినా నేతలు వారిని నిలువరించలేకపోయారు. పలువురు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, నాయకులు కూడా ఒక్కొక్కరుగా పార్టీ వీడుతున్నారు. బీఆర్‌ఎస్‌కు బలమైన క్యాడర్ ఉన్నా నేతల్లో విభేదాల వల్ల కుమ్ములాటలు పెరిగి గందరగోళం నెలకొంది. పార్లమెంటు ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఆయా పార్టీలు సత్తా చాటుకునే ప్రయత్నాల్లో ఉండడంతో రాజకీయాలు వేడెక్కుతున్నాయి.

### అవిశ్వాసానికి రంగం సిద్ధం

బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవిపై అవిశ్వాసం పెట్టేందుకు కాంగ్రెస్ కలెక్టర్‌కు లేఖ అదించి క్యాంపునకు తరలివెళ్లారు. బీఆర్‌ఎస్ నేతల్లో నెలకొన్న విభేదాలు, గొడవల నేపథ్యంలో కాంగ్రెస్ నాయకులు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జాహ్నవి తండ్రి నిట్టు వేణుగోపాల్ రావ్‌పై బీఆర్‌ఎస్‌లో అసంతృప్తితో ఉండడం, ఆయన పార్టీ మారే ఆలోచనలో ఉన్న పరిస్థితుల్లో అవిశ్వాసం నోటీసు ఇవ్వడం ప్రాధాన్యత సంతరించుకుంది.

# బల్దియా చైర్‌పర్సన్‌కు షాక్..!



కలెక్టర్‌కు అవిశ్వాస తీర్మానం నోటీసును అందజేస్తున్న కాంగ్రెస్ కౌన్సిలర్లు

- అవిశ్వాస తీర్మానం కోరిన కామారెడ్డి కాంగ్రెస్ కౌన్సిలర్లు
- 27 మంది సంతకాలతో కలెక్టర్‌కు నోటీసు అందజేత

కామారెడ్డి టౌన్: బీఆర్‌ఎస్‌కు చెందిన కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవికి షాక్ తగిలింది. సోమవారం 27 మంది కాంగ్రెస్ కౌన్సిలర్లు కలెక్టర్ జితేష్ పాటిల్‌కు అవిశ్వాసం నోటీసును అందజేశారు. వీరి వినతి మేరకు ఈ నెల చివరి వారంలో అవిశ్వాస తీర్మాన సమావేశం తేదీని ప్రకటించనున్నారు. దీంతో అవిశ్వాసం నెగ్గేందుకు కాంగ్రెస్ కౌన్సిలర్లు రంగం సిద్ధం చేసుకుంటున్నారు.

### అధ్యక్ష పదవిపై కాంగ్రెస్ గురి

2019 మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ 23, కాంగ్రెస్ 12, బీజేపీ 8, స్వతంత్రులు ఆరుగురు గెలుపొందారు. స్వతంత్రులను ఆరుగురికి కలుపుకుని బీఆర్‌ఎస్ చైర్‌పర్సన్, వైస్‌చైర్‌పర్సన్ పదవులను దక్కించుకుంది. క్రమేనా కాంగ్రెస్ నుంచి 8, బీజేపీ నుంచి ఇద్దరు కౌన్సిలర్లు బీఆర్‌ఎస్‌లో చేరారు. చైర్‌పర్సన్ జాహ్నవి తండ్రితో పాటు బాబాయ్ అండతో నాలుగేళ్లుగా కౌన్సిల్ పాలన సాగించారు. అయితే అసెంబ్లీ ఎన్నికల సమయంలో వైస్ చైర్‌పర్సన్ ఇందుప్రియ కాంగ్రెస్‌లో చేరారు. అప్పటి నుంచి కేవలం నలుగురుగా ఉన్న కాంగ్రెస్ సభ్యుల సంఖ్య మూడు నెలల్లోనే 27కు చేరింది. అసెంబ్లీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ పార్టీ చైర్‌పర్సన్ పదవిపై గురిపెట్టింది. ఈ క్రమంలో డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌తో పాటు వైస్ చైర్‌పర్సన్‌తో కలిసి కౌన్సిలర్లు కలెక్టరేట్‌కు వచ్చి అవిశ్వాసం నోటీసులను అందజేశారు.

### అవిశ్వాసం నెగ్గేనా..!

ప్రస్తుతం కాంగ్రెస్‌కు 27 మంది సభ్యుల బలం ఉంది. బీఆర్‌ఎస్‌కు 16, బీజేపీ ఆరుగురు కౌన్సిలర్లు ఉన్నారు. అవిశ్వాసం రోజు 34మంది కౌన్సిలర్ల కోరం హాజరైతేనే అవిశ్వాస తీర్మాన ప్రక్రియను అధికారులు ప్రారంభిస్తారు. ఒక్కరు తగ్గినా కోరం లేకఅవిశ్వాసం వీగిపోతుంది. అంటే కాంగ్రెస్‌కు మరో ఏడుగురు సభ్యుల బలం కావాల్సి ఉంది. పాత పట్టణంలోని ఇద్దరు బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు రెండు రోజుల్లో కాంగ్రెస్‌లో చేరబోతున్నారని తెలిసింది. అలాగే మరో ఐదుగురు కౌన్సిలర్లు అవిశ్వాసానికి మద్దతు ఇస్తామని చెబుతున్నారు. బీజేపీ కౌన్సిలర్లు దూరంగా ఉండనున్నారు. దీంతో అవిశ్వాసం నెగ్గే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. కౌన్సిలర్లను క్యాంపునకు తరలించేందుకు పార్టీ సిద్ధమవుతోంది.

### చైర్‌పర్సన్ సీటు రేసులో ఇద్దరు..

పట్టణంలోని 10వ వార్డు కౌన్సిలర్ ఉర్దోండ వనిత చైర్‌పర్సన్ రేసులో ఉన్నారు. తాజాగా వైస్ చైర్‌పర్సన్ ఇందుప్రియ సైతం చైర్‌పర్సన్ పోటీలో ఉన్నానని తెలిపింది. ఇదిలా ఉండగా చైర్‌పర్సన్ జాహ్నవి, తండ్రి నిట్టు వేణు పార్టీ మారతారనే ప్రచారం జరుగుతోంది. చైర్‌పర్సన్, ఆమె బాబాయ్, అనుచరులు ఐదుగురు కౌన్సిలర్లు పార్టీ వీడే అవకాశాలున్నాయి. ఒక వేళ వారు కాంగ్రెస్‌లో చేరితే అవిశ్వాసం రద్దయ్యే అవకాశలున్నాయి. కానీ ఇటీవల ఎంపీ బీబీపాటిల్‌తో చర్చలు జరపడంతో బీజేపీలోకి చేరబోతున్నారనే ప్రచారం జరుగుతోంది.

# సాగర్ నీటిని ఆయకట్టుకు మళ్లిస్తాం

- ఏడాదిలోగా 'లెండి' నీళ్లందిస్తాం
- జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

నిజాంసాగర్(జుక్కల్): నాన్‌కమాండ్ ఏరియాకు నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి నీటిని మళ్లించి ఆయకట్టు సాగు నీరందిస్తామని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. సాగునీటి వసతి లేక బీడు వారిన 40వేల ఎకరాల ఆయకట్టుకు నీరందడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. సోమవారం బిచ్కుందలో సెంట్రల్ లైటింగ్, వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంజీర నదిపై నిర్మిస్తున్న నాగమడు ఎత్తిపోతల పనులను రీడిజైన్ చేయడం వల్ల చుట్టుపక్కల గ్రామాల రైతుల భూములు ముంపునకు గురవుతున్నాయన్నారు. గత 15 ఏళ్ల జుక్కల్ నియోజకవర్గ ఎమ్మెల్యే ఉన్న హన్మంత్ సింధే తనపై చేస్తున్న దుష్ప్రచారాన్ని మానుకోవాలన్నారు. కాంట్రాక్టర్లు ఇచ్చే కమీషన్ల కోసం కక్కుర్తిపడిన మాజీ ఎమ్మెల్యే చేస్తున్న ఆరోపణలు అసంబద్ధమైనవన్నారు. మద్నూర్, జుక్కల్, బిచ్కుంద మండలాలకు వరప్రదాయని అయిన లెండి ప్రాజెక్టు గురించి మాజీ ఎమ్మెల్యే ఏనాడు మాట్లాడలేదన్నారు. ఏడాదిలోగా లెండి ప్రాజెక్టు నుంచి బిచ్కుంద, మద్నూర్, జుక్కల్ మండలాల్లోని 20 వేల ఎకరాలకు సాగు నీరందిస్తామని హామీ ఇచ్చారు. ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలుపించుకుందామని పిలుపునిచ్చారు. అనంతరం పిట్లం, జుక్కల్, బిచ్కుంద మండలాల్లోని బీఆర్‌ఎస్, బీఎస్పీ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీ కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ శెట్కార్, కాంగ్రెస్ నాయకులు జయప్రదీప్, రవీందర్‌రెడ్డి, రమేశ్ యాదవ్, మల్లయ్యగారి ఆకాశ్, సవాయిసింగ్ తదితరులు పాల్గొన్నారు.

# అజర్ బైజాన్‌లో అవస్థలు

- వలస కార్మికులను విజిట్ వీసాలపై పంపించిన ట్రావెల్స్ సంస్థ

మోర్తాడ్(బాల్కొండ): ఏర్గట్ల మండలం తాళ్లరాంపూర్‌కు చెందిన రాంపల్లి జనార్దన్ 20 రోజుల క్రితం అజర్ బైజాన్ దేశానికి వెళ్లాడు. అక్కడ హోటల్‌లో క్లీనింగ్ పని చేయడానికి అవకాశం ఉందని రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడకు చెందిన ఒక ఏజెంటు చెబితే రూ.1.50 లక్షలు చెల్లించి వెళ్లాడు. వర్క్ వీసాకు బదులు విజిట్ వీసాపైనే జనార్దన్‌ను పంపించిన ఏజెంటు వర్క్ వీసా ఇప్పిస్తానని నమ్మించాడు. విజిట్ వీసాకు నెల రోజులే గడువు ఉంది. గడువు సమీపిస్తున్నా వర్క్ వీసా ఇప్పించకపోవడంతో అతను రెండు రోజుల క్రితం ఇంటికి చేరుకున్నాడు. తాను సకాలంలో ఇంటికి వచ్చి ఉండకపోతే మన కరెన్సీలో రూ.30 వేలు జరిమానా చెల్లించాల్సి రావడంతో పాటు మూడేళ్ల జైలు శిక్ష అనుభవించాల్సి వచ్చేదని జనార్దన్ తెలిపారు. జనార్దన్‌తో పాటు నిర్మల్ జిల్లాకు చెందిన వెంకట్, వేములవాడకు చెందిన అజయ్‌లు వెళ్లగా వారు ఇంకా అక్కడే ఉన్నారు. ఇలా చాలా మంది అక్కడే ఉన్నారు. వీరికి వీసాల గడువు మరో నాలుగు రోజుల్లో ముగిసిపోనుంది. సకాలంలో వర్క్ వీసా రాకపోయినా, ఇంటికి తిరిగి వెళ్లకపోయినా తాము కూడా జరిమానా చెల్లించడంతో పాటు జైలు శిక్షను అనుభవించాల్సి వస్తుందని వలస కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఢిల్లీ కేంద్రంగా పని చేస్తున్న ఒక ట్రావెల్స్ సంస్థ ద్వారా ఏజెంట్లు వలస కార్మికులను అజార్ బైజాన్‌కు తరలించారు. ఒక్కొక్కరి నుంచి వీసాల కోసం రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు వసూలు చేశారు. వర్క్ వీసాలు ఇప్పించకుండా విజిట్ వీసాలు అంటగట్టి ఆటలాడుకుంటున్నారు. మోసం చేసిన ఏజెంట్లు, ట్రావెల్స్ సంస్థపైనా చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

# ఉపాధి ఉద్యోగులకు వేతనాల్లేవ్!

## నాలుగు నెలలుగా పెండింగ్

- నిత్యావసరాలు సైతం కొనలేని దైన్యం
- అప్పులపాలవుతున్న కుటుంబాలు
- ఆదుకోవాలని సర్కారుకు విన్నపం



క్యాసంపల్లిలో ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలు

కామారెడ్డి రూరల్: జాతీయ ఉపాధి హామీ పథకం ఉద్యోగులు వేతనాలు రాక అవస్థలు పడుతున్నారు. నాలుగు నెలల జీతం అందక బతుకు భారంగామారిందని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంటి కిరాయి, పిల్లల చదువులకు ఫీజుతో పాటు నిత్యావసరాలకు కూడా అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు.

### అనేక పనుల్లో కీలకపాత్ర..

ఈజీఎస్ కింద గ్రామీణ ప్రాంతాల్లో అనేక అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. రైతు వేదికల నిర్మాణం, కల్లాలు, పల్లె ప్రకృతి వనాలు, వైకుంఠధామాలు, నర్సరీలు, పాంపాండ్‌లు, ఇంకుడు గుంతలు, మరుగుదొడ్ల నిర్మాణం, హరితహారం, ఎవెన్యూ ప్లాంటేషన్, పశువుల షెడ్డు నిర్మాణం, మురుగు కాల్వల, గ్రామీణ క్రీడా ప్రాంగణాల నిర్మాణం ఇలా సుమారు 40 రకాలకు పైగా పనుల నిర్వహణలో ఈజీఎస్ ఉద్యోగులు కీలక పాత్ర పోషిస్తున్నారు. దీంతో వారిపై పనిభారం పడుతోంది. కామారెడ్డి జిల్లాలో సహాయ ప్రాజెక్టు అధికారులు 10 మంది, ఇంజినీరింగ్ కన్సల్టెంట్లు 8, సాంకేతిక సహాయకులు 65, కంప్యూటర్ ఆపరేటర్లు కమ్ అకౌంటెంట్లు 40, క్షేత్ర సహాయకులు 450 మంది, విధులు నిర్వహిస్తున్నారు. క్షేత్ర సహాయకులు ప్రతి గ్రామానికి ఒకరు అవసరమున్నా ప్రస్తుతం 3, 4 గ్రామాలు చూసుకుంటున్నారు. కంప్యూటర్ ఆపరేటర్లు మండలానికి ఇద్దరు ఉండాల్సి ఉండగా మొత్తం 22 మండలాలకు గాను 20 మంది మాత్రమే ఉన్నారు. ఇంత కష్టపడుతున్నా నాలుగు నెలలుగా జీతాలు అందక అప్పుల పాలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేతన బకాయిలు క్లియర్ చేసి ప్రతినెలా వేతనం ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

### పేస్కేల్ అమలు చేయాలి



జాతీయ ఉపాధిహామీ పథకం కింద ఎంతో మంది కూలీలకు పనులు కల్పిస్తూ తాము పస్తులుంటున్నాం. నాలుగు నెలలుగా వేతనాలు లేక బతుకు భారంగా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పేస్కేల్ అమలు చేస్తామన్నారు. ఇప్పటి వరకు చేయలేదు. వెంటనే పేస్కేలు అమలు చేసి హెల్త్ కార్డులు అందజేయాలి. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా ప్రతినెలా ఒకటో తేదీన వేతనాలివ్వాలి.

–కొండయ్య, జిల్లా అధ్యక్షుడు, ఫీల్డ్ అసిస్టెంట్స్ యూనియన్, కామారెడ్డి

### ప్రతినెలా చెల్లించాలి



జిల్లాలో నూతన జీపీలు ఏర్పాటు చేశాక ఇప్పటి వరకు సిబ్బందిని నియమించలేదు. అంతేకాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టగానే మాకు కనీస వేతనం, ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇవ్వడంతో ఎన్నో ఆశలు పెట్టుకున్నాం. కానీ ఇప్పటి వరకు ఆ ఊసే ఎత్తడం లేదు. ఇప్పటికైనా వేతన బకాయిలు క్లియర్ చేసి పేస్కేల్ వర్తింపజేయాలి.

–శ్యామ్, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్స్ యూనియన్

# సకాలంలో బియ్యం అప్పగించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పాటిల్

కామారెడ్డి క్రైం: బిడ్డర్లకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా 2022– 23 రబీ సీజన్‌కు సంబంధించిన సీఎంఆర్‌ను అప్పగించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ రైస్‌మిల్లర్లకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం గత రబీకి సంబంధించి 1.61 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని వేలం వేసి బిడ్డర్లకు కేటాయించిందన్నారు. ఇందుకు సంబంధించి జిల్లాలోని 85 రైస్ మిల్లర్లకు కేటాయించిన ధాన్యాన్ని మరపట్టిన అనంతరం బియ్యాన్ని బిడ్డర్ల(వేలం పాడిన వారు)కు అప్పగించాల్సి ఉందన్నారు. సకాలంలో బియ్యాన్ని అప్పగించాలని సూచించారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి మల్లికార్జున బాబు, సహాయ పౌరసరఫరాల అధికారి నిత్యానందం, రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### తిమ్మాపూర్‌లో కుస్తీ పోటీలు



ఎల్లారెడ్డి : మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో సోమవారం కుస్తీ పోటీలను ఘనంగా నిర్వహించారు.మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా కుస్తీ పోటీలను నిర్వహించారు. కుస్తీ పోటీలకు చుట్టు పక్కల మండలాలకు చెందిన మల్లయోధులు కుస్తీ పట్టారు. కొబ్బరికాయ కుస్తీ నుంచి వెండి కడియం కుస్తీ వరకు పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో రవీందర్, అరవింద్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులున్నారు.

### నియామకం



బాన్సువాడ : కామారెడ్డి జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడిగా గాదం సత్యనారాయణను సోమవారం డైరెక్టర్లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ నెల 9న కామారెడ్డిలో జరిగిన జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికల్లో బాన్సువాడ కాంగ్రెస్ పార్టీకి చెందిన గాదం సత్యనారాయణ ప్యానల్‌కు సంబంధించిన డైరెక్టర్లు విజయం సాధించారు. 11 మంది డైరెక్టర్లు గాదం సత్యనానాయణ పేరు ప్రతిపాదించారు. దీంతో సత్యనారాయణను అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా నియమించారు. అధ్యక్షులుగా సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా పసుపుల పెద్ద సాయిలు (సోమేశ్వర్)ను ఎన్నుకున్నారు. ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి వీరిని అభినందించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మాసాని శ్రీనివాస్‌రెడ్డి, ప్రతాప్‌సింగ్, కొత్తకొండ భాస్కర్, మంత్రి గణేష్, బస్వరాజ్ తదితరులు ఉన్నారు.

### మేరు సంఘం జిల్లా నూతన కార్యవర్గం



కామారెడ్డి టౌన్ : కామారెడ్డి జిల్లా మేరు సంఘం నూతన కమిటిని సోమవారం జిల్లా కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా సరికొండ నారాయణ, ప్రధాన కార్యదర్శిగా కొట్టురు రఘునాథ్, కోశాధికారిగా రాచర్ల సంతోష్,గౌరవ అధ్యక్షుడిగా రాచార్ల రమేష్,కొత్తకొండ భాస్కర్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంఛార్జి రుద్రంగి రమేష్, రాష్ట్ర అడహాక్ కమిటీ సభ్యుడు పోల్కం గంగాకిషన్, నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు సోమ హన్మంతరావు, ప్రదాన కార్యదర్శి దేవదాస్, కోశాధికారి చంద్రకాంత్, ప్రతినిధులు నరేందర్, దశరథ్, సంతోష్ 23 మండలాల అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు పాల్గొన్నారు.

# ఫిర్యాదులు వెంటనే పరిష్కరించాలి

- కలెక్టర్ జితేష్ వి పాటిల్
- ప్రజావాణికి 48 ఫిర్యాదులు



ప్రజావాణికి తరలివచ్చిన జనం



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ పాటిల్

కామారెడ్డి క్రైం : ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి మొత్తం 48 ఫిర్యాదులు వచ్చాయి. వాటిలో వాటిలో 24 ఫిర్యాదులు భూ సమస్యలకు సంబంధించినవి కాగా, 6 డబుల్ బెడ్‌రూం ఇళ్లు, 5 ఉపాధి కల్పనకు సంబంధించిన ఫిర్యాదులు నమోదయ్యాయి. మిగితావి ఆయా శాఖలకు చెందినవి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ సంబంధిత ఫిర్యాదులే ఎక్కువగా వస్తున్నాయన్నారు. మండల, డివిజన్ స్థాయిలో పరిష్కారమయ్యే భూ సమస్యలను సంబంధిత అధికారులు అక్కడే పరిష్కరించాలని ఆదేశించారు.

వాజ్యానికి సంబంధించిన సమస్యలుంటే కోర్టును ఆశ్రయించేలా ఫిర్యాదుదారులకు అవగాహన కల్పించాలన్నారు. వారంతా ప్రజావాణికి వచ్చేలా చేయకూడదని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో చందర్ నాయక్, ఐసీడీఎస్ పీడీ బావయ్య, ఆయా శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏవో మస్రూర్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ ఎదుట ఎండీఎం కార్మికుల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికులు

కామారెడ్డి టౌన్ : ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన పథకం(ఎండీఎం) కార్మికులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. మధ్యాహ్న భోజన పథకం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చక్రపాణి మాట్లాడుతూ గత నాలుగు నెలలుగా బిల్లులు బకాయిలు ఉండటంతో అప్పులు చేసి వంటలు చేస్తున్నారని వాపోయారు. ప్రభుత్వం తక్షణమే బిల్లులు చెల్లించాలని లేని పక్షంలో ఈనెల 15వ తేది నుంచి సమ్మెకు వెళ్లనున్నట్లు ప్రకటించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసి నిజామాబాద్ జిల్లా ఇన్‌చార్జి ఓమయ్య, నాయకులు దశరత్, సాయిలు, సోఫియా, రియాజుద్దిన్, మల్లవ్వ తదితరులున్నారు.

# అవుట్‌లెట్లపై ప్రజలకు నమ్మకం

- పోలీస్ వెల్ఫేర్ సొసైటీ ఫిల్లింగ్ స్టేషన్‌ను ప్రారంభించిన కలెక్టర్ రాజీవ్‌గాంధీ



కారులో డీజిల్ పంప్ చేస్తున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, పక్కన సీపీ కల్మేశ్వర్

ఖలీల్‌వాడి: ప్రైవేట్ పెట్రోల్ పంపులతో పోలిస్తే ప్రభుత్వరంగ సంస్థల ఆధ్వర్యంలో నడిపే అవుట్‌లెట్లపై ప్రజలకు నమ్మకం ఉంటుందని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అన్నారు. జిల్లా కేంద్రంలో పోలీస్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఫిల్లింగ్ స్టేషన్‌ను కలెక్టర్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవుట్ లెట్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఫిల్లింగ్ స్టేషన్ ద్వారా వచ్చే లాభాలను పోలీసు కుటుంబాల సంక్షేమానికి వినియోగిస్తామని సీపీ కల్మేశ్వర్ అన్నారు. పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో మొదటి పెట్రోల్‌పంప్ అని ఐవోసీ సీజీఎం శుభ్రత్ రత్ అన్నారు. పోలీసు, జైళ్ల తదితర శాఖల ఆధ్వర్యంలో నిర్వహించే అవుట్‌లెట్లపై ప్రజలు పూర్తి నమ్మకం ఉందని, లాభాల్లో నడుస్తున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రొబెషనరీ ఐపీఎస్ బి చైతన్యరెడ్డి, సీనియర్ మేనేజర్ మోహన్‌కిశోర్, నిజామాబాద్, ఆర్మూర్ ఏసీపీలు రాజావెంకట్ రెడ్డి, నాగయ్య, నిజామాబాద్ ఐవోసీఎల్ ఆఫీసర్ క్రాంతికుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## మున్నూరుకాపు మహిళలు రాణించాలి



మహిళా ఉద్యోగులను సన్మానిస్తున్న నాయకులు

కామారెడ్డి అర్బన్ : తెలంగాణ మున్నూరుకాపు ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కామారెడ్డి జిల్లాకు చెందిన మహిళా ఉద్యోగులను సన్మానించారు. మున్నూరుకాపు మహిళలు ఉన్నత విద్య, వ్యాపార, రాజకీయ రంగాల్లో రాణించే విధంగా తోడ్పాటు ఇవ్వాలని సమావేశం కోరారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఈ.వెంకటకిషన్, ప్రతినిధులు ఈ.సత్యనారాయణ, మామిడి రమేష్, నేతి మంగమ్మ, శ్రవణ్, టి.సుధారాణి, నీలం రాజులు తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి

- ఎస్పీ సింధు శర్మ



మహిళా పోలీసులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కామారెడ్డి క్రైం: ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ తీసుకోవాలని ఎస్పీ సింధు శర్మ అన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం పట్టణంలోని శ్రీ మెడికేర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో మహిళా పోలీసులకు మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించారు. మహిళా పోలీసు అధికారులు, సిబ్బందికి వైద్య పరీక్షలు చేపట్టారు. అంతకు ముందుగా హైదరాబాద్‌కు చెందిన మనో జాగృతి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో సైకాలజిస్ట్ వీరభద్రరావు పలు సూచనలు చేశారు. ఒత్తిడికి గురి కాకుండా ఉండేందుకు పాటించాల్సిన విధానాలను మహిళా ఉద్యోగులకు వివరించారు. కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ కాజల్ సింగ్, ఏఎస్పీ నర్సింహారెడ్డి, డీఎస్పీ నాగేశ్వర్ రావు, సీఐలు, ఎస్సైలు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రైతులకు ఈ కేవైసీ తప్పనిసరి



బాన్సువాడ : పీఎం కిసాన్ సమ్మాన్ నిధికి సంబంధించి ఈ కేవైసీని రైతులు తప్పనిసరిగా చేసుకోవాలని బీర్కూర్ సీనియర్ వ్యవసాయ విస్తరణ అధికారి శ్రావణ్‌కుమార్ అన్నారు. సోమవారం రైతు వేదికలో ఆయన రైతులకు అవగాహన కల్పించారు. ఆధార్‌కార్డుకు మొబైల్ నంబర్, బ్యాంక్ అకౌంట్ అనుసంధానం చేసుకుంటేనే 15, 16వ విడతల పీఎం కిసాన్ సమ్మాన్ నిధి డబ్బులు జమవుతాయన్నారు.

## రంజాన్ గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు

కామారెడ్డి అర్బన్ : రంజాన్ మాసం సందర్భంగా నెలరోజుల పాటు ఏవైనా సమస్యలు ఎదురైతే ముస్లింలు కలెక్టరేట్‌లోని మైనారిటీ సంక్షేమ శాఖ కార్యాలయంలో గ్రీవెన్స్‌సెల్‌ను సంప్రదించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మైనారిటీ సంక్షేమ శాఖ 93982 35585, 90102 61667లను సంప్రదించవచ్చన్నారు.

# ఎల్లారెడ్డి బల్దియా బడ్జెట్‌కు ఆమోదం



మాట్లాడుతున్న కమిషనర్ శ్రీహరి రాజు

ఎల్లారెడ్డి: 2024–2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన అంచనా బడ్జెట్‌కు మున్సిపల్ పాలకవర్గం ఆమోదం తెలిపినట్లు కమిషనర్ శ్రీహరి రాజు సోమవారం తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో చైర్మెన్ కుడుముల సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన అంచనా బడ్జెట్‌లో మున్సిపాలిటీకి సంబంధించి రూ. 5.33 కోట్ల అంచనాతో బడ్జెట్‌ను రూపొందించగా దానిని పాలకవర్గం ఆమోదం తెలిపినట్లు ఆయన తెలిపారు. వీటిలో పారిశుధ్య, ఔట్ సోర్సింగ్ సిబ్బంది వేతనాలతో పాటు, విలీన గ్రామాల అభివృద్ధి, హరితహారం, సానిటేషన్ కోసం నిధులను ఖర్చు చేయనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మెన్ సుజాత, కౌన్సిలర్లు శ్రీకాంత్, నీలకంఠం, మహేశ్వరి, జీనత్ సుల్తానా, సాయిలు, శ్రీనివాస్, విజయలక్ష్మి, భూదేవి తదితరులున్నారు.

# టీచర్ల సమస్యల పరిష్కారానికి కృషి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న పీఆర్‌టీయూ తెలంగాణ నాయకులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు తమ సంఘం కృషి చేస్తుందని పీఆర్‌టీయూ తెలంగాణ జిల్లా అధ్యక్షుడు అంబీర్ మనోహర్‌రావు సూచించారు. నాగిరెడ్డిపేట మండలం గోపాల్‌పేట హైస్కూల్‌లో సోమవారం స్థానిక ఉపాధ్యాయుతో కలిసి వారు పీఆర్‌టీయూ తెలంగాణ క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. జీ.వో నం.317 బాధిత ఉపాధ్యాయులు త్వరలోనే సొంతజిల్లాలకు బదిలీ అయ్యేందుకు తమ యూనియన్ కృషి చేస్తుందన్నారు. దీంతోపాటు ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయులు ఏప్రిల్ 23వ తేదీన రిలీవ్ అయ్యేలా చూస్తామన్నారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో అటెండర్ లేదా స్కావెంటర్ నియమింపజేసేలా చేస్తామన్నారు. సర్వశిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు మినిమం టైంస్కేల్ వర్తింపజేస్తామని పేర్కొన్నారు. ఆయన వెంట పీఆర్‌టీయూ తెలంగాణ జిల్లా కార్యదర్శి లక్ష్మీరాజం, అసోసియేట్ అధ్యక్షుడు సాయాగౌడ్, ప్రకాశ్ ఉన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థులు

## అపూర్వ సమ్మేళనం

కామారెడ్డి టౌన్ : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2001– 2004లో చదివిన బీఎస్సీ ఎంపీసీఎస్ పూర్వ విద్యార్థులు సోమవారం జిల్లా కేంద్రంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. చదువుకునే రోజుల జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. అప్పటి లెక్చరర్లను ముఖ్య అతిథులుగా అహ్వానించి ఘనంగా సన్మానించారు. రెండు దశాబ్దాల తర్వాత కలుసుకోవడంతో రోజంతా సంతోషంతో ఉల్లాసంగా గడిపారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు.



క్రైం కార్నర్

# వేర్వేరు ప్రాంతాల్లో నలుగురి ఆత్మహత్య

ఉమ్మడి జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో నలుగురు ఆత్మహత్య చేసుకున్నారు. ముగ్గురు ఉరేసుకోగా, గత గురువారం గడ్డి మందు సేవించిన ఒకరు పరిస్థితి విషమించి మృతి చెందారు.

- మద్యానికి బానిసై ఇద్దరు
- ఆర్థిక ఇబ్బందుల కారణంగా మరో ఇద్దరు



అశోక్ (ఫైల్)

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రానికి చెందిన దాసరి గోపి (36) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. మద్యానికి బానిసకావడం, అప్పులబాధ కారణంగా గోపి ఇంటి పక్కన ఉన్న చేదబావికి ఏర్పాటు చేసిన గిరక దుంగకు తాడుతో ఉరేసుకున్నాడన్నారు. మృతుడు తాపీమేస్త్రిగా పని చేసేవాడని, భార్య లక్ష్మి, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నట్లు తెలిపారు.

**చిక్కడపల్లిలో..**



శంకర్ (ఫైల్)

రుద్రూర్: ఆర్థిక ఇబ్బందులు తాళలేక మండలంలోని చిక్కడపల్లికి చెందిన మచ్కూరి శంకర్ (38) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. కుటుంబ అవసరాల కోసం గత మూడేళ్లుగా అప్పులు చేస్తున్న శంకర్.. చివరి అవి తీర్చే మార్గం కనిపించక ఆదివారం రాత్రి ఇంట్లో ఉరేసుకున్నాడన్నారు. మృతుడి భార్య జానకి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

**జైతాపూర్‌లో..**

ఎడపల్లి (బోధన్) : అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందుల కారణంగా మండలంలోని జైతాపూర్ గ్రామానికి చెందిన మాతంగి సాయిలు (54) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై విక్రం తెలిపారు. గ్రామపంచాయతీ పార్కులో ఎవరూ లేనిసమయంలో మధ్యాహ్నం సమయంలో చెట్టుకు ఉరేసుకున్నాడని, మృతుడి భార్య మాతంగి గంగామణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

**జప్తిజాన్కంపల్లిలో..**



రామకిష్టయ్య(ఫైల్)

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని జప్తిజాన్కంపల్లికి చెందిన చిన్నన్న రామకిష్టయ్య(51) అనే వ్యక్తి మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నాడు. ఈనెల 7వ తేదీన ఇంటి వద్ద కిష్టయ్య గడ్డి మందు సేవించగా, గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఎల్లారెడ్డిలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అక్కడి వైద్యుల సూచన మేరకు సోమవారం హైదరాబాద్‌కు తరలిస్తుండగా కిష్టయ్య మృతి చెందినట్లు ఎస్సై రాజు తెలిపారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## లారీ ఢీకొని ఒకరు మృతి

ఖలీల్‌వాడి: నగరంలోని ఆరో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సారంగాపూర్ వద్ద రోడ్డు దాటుతున్న వ్యక్తిని లారీ ఢీకొట్టడంతో సదరు వ్యక్తి మృతి చెందాడు. మృతుడిని సారంగాపూర్‌కు చెందిన రాథోడ్ రామారావుగా గుర్తించామని, లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

**గుండెపోటుతో ప్రభుత్వ టీచర్ ..**



నాగ్‌నాథ్ అప్ప (ఫైల్)

మద్నూర్(జుక్కల్): మద్నూర్ మండల కేంద్రానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు నాగ్‌నాథ్ అప్ప(50) సోమవారం గుండెపోటుతో మృతి చెందినట్లు సహఉపాధ్యాయులు తెలిపారు. మండలంలోని మేనూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న నాగ్‌నాథ్ సోమవారం ఉదయం తన పిల్లలను బైక్‌పై స్కూల్ వద్ద దింపి తిరిగి వస్తుండగా, రోడ్డుపై పడిపోయాడు. గమనించిన స్థానికులు వెంటనే మద్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా,అక్కడ సీపీఆర్ చేసి దెగ్లూర్‌కు తరలిస్తుండగా మృతి చెందాడు. నాగ్‌నాథ్ మృతిని తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు జీర్ణించుకోలేకపోతున్నారు.మృతుడికిభార్య,కూతురు,కొడుకు ఉన్నారు.

## పట్టుబడ్డ బియ్యం 1432 క్వింటాళ్లు

వేల్పూర్: మండల కేంద్రంలోని వజ్ర రైస్‌మిల్లులో పట్టుబడిన బియ్యం మొత్తం 1432 క్వింటాళ్లు ఉందని ఎస్సై వినయ్‌కుమార్ సోమవారం తెలిపారు. వజ్ర రైసుమిల్లులో శనివారం అర్ధరాత్రి పట్టుకున్న రెండు లారీల లోడ్ బియ్యంతో పాటు అక్కడ నిల్వ ఉంచిన బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. బియ్యాన్ని సంచుల్లో నింపిన తరువాత అక్లూర్ సమీపంలోని సాయికృష్ణ రైస్‌మిల్లుకు తరలించే సరికి ఆదివారం అర్ధరాత్రి దాటినట్లు సమాచారం. పట్టుబడిన బియ్యం మొత్తం తూకం వేయగా 1432 క్వింటాళ్లు ఉన్నట్లు ఎస్సై తెలిపారు.

## అదనపు కట్నం కేసు నమోదు

ఎల్లారెడ్డి: అదనపు కట్నం కోసం వేధించిన ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేశ్ సోమవారం తెలిపారు.వివరాలు ఇలా ఉన్నాయి..మండలంలోని మత్తమాల గ్రామానికి చెందిన పెద్దగొల్ల సుగుణకు 25 ఏళ్ల క్రితం మెదక్ జిల్లా కొత్తపల్లి గ్రామానికి చెందిన మల్లయ్యతో వివాహమైంది.సుగుణకు సంతానం కలగక పోవడంతో 15 ఏళ్ల క్రితం మంజుల అనే మహిళను మల్లయ్య రెండో వివాహం చేసుకున్నాడు. అదనపు కట్నం కోసం మొదటి భార్య సుగణను వేధిస్తుండడంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు మల్లయ్యతోపాటు మంజులపై గృహహింస, వరకట్నం వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## హైవేపై ఆటో బోల్తా

- తొమ్మిదిమందికి గాయాలు



నిజామాబాద్ రూరల్(డిచ్‌పల్లి): డిచ్‌పల్లి మండలం సాంపల్లి పరిధిలోని 44వ నంబర్ జాతీయ రహదారిపై సోమవారం సాయంత్రం ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడిందని ఎస్సై మహేశ్ తెలిపారు. ఈ ఘటనలో తొమ్మిది మందికి గాయాలయ్యాయన్నారు. ఆర్మూర్ నుంచి డిచ్‌పల్లి వైపు వస్తుండగా ప్యాసింజర్ ఆటోను డ్రైవర్ సలీం అతివేగం, అజాగ్రత్తగా నడపడంతో బోల్తా పడిందన్నారు. గాయాలపాలైన తొమ్మిదిమందిని చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

## గ్రామీణ బ్యాంకులో చోరీకి యత్నం

- సైరన్ మోగడంతో పరారైన దొంగలు



దుండగులు తొలగించిన కిటికీ

ఆర్మూర్‌టౌన్: మండలం పిప్రిలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకులో దుండగులు చోరీకి యత్నించారు. ఆదివారం అర్ధరాత్రి బ్యాంకు కిటికీని తొలగించిన ఇద్దరు దుండగులు లోనికి ప్రవేశించారు. లాకర్‌ను ధ్వంసం చేస్తుండగా, సైరన్ మోగడంతో అక్కడి నుంచి పరారయ్యారు. అప్రమత్తమైన బ్యాంకు అధికారులు డయల్ 100కు సమాచారం అందించగా, పోలీసులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. సీసీ ఫుటేజీని పరిశీలించి ఇద్దరు దుండగులు చోరీకి యత్నించినట్లు గుర్తించారు. బ్యాంక్ మేనేజర్ రాజేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో రవికుమార్ తెలిపారు.

# ప్రారంభానికి నోచుకోని కస్తూర్బా

- పనులు ప్రారంభమై మూడేళ్లు పూర్తి
- ఇంకా అసంపూర్తిగానే నిర్మాణం
- అద్దె భవనంలో ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు



కస్తూర్బా పాఠశాల భవనం

మోర్తాడ్: ఏర్గట్ల మండల కేంద్రంలో కస్తూర్బా పాఠశాల భవన నిర్మాణ పనులు ప్రారంభమై మూడేళ్లు పూర్తయినా ఇంకా అసంపూర్తిగానే ఉంది. పాఠశాలను ప్రస్తుతం అద్దె ఇంట్లో కొనసాగిస్తున్నారు. అరకొర వసతుల కారణంగా విద్యార్థినులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమగ్రి శిక్ష కార్యక్రమం కింద పాఠశాల, వసతి గృహం నిర్మాణ పనులను రూ.3.35 కోట్ల వ్యయంతో చేపట్టగా, 2021 జనవరిలో అప్పటి మంత్రి ప్రశాంత్‌రెడ్డి పనులను ప్రారంభించారు. నిర్మాణ పనులు పూర్తికాగా రంగులువేయించారు. అయితే, విద్యుత్ సరఫరాతోపాటు చిన్నచిన్న పనులు పూర్తికపోవడంతో భవనం ప్రారంభానికి నోచుకోవడం లేదు. సొంత భవనం వినియోగంలోకి వస్తే పదో తరగతి పూర్తి చేసుకున్న వారు ఇంటర్ కూడా ఇక్కడే చదువుకోవడానికి అవకాశం కలుగుతుంది. జిల్లాలోని వివిధ కస్తూర్బా పాఠశాలల్లో ఇప్పటికే ఇంటర్ విద్యను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఏర్గట్లలో జూనియర్ కళాశాల లేకపోవడంతో కస్తూర్బా పాఠశాలలో ఇంటర్ కోర్సులను చేర్చితే పరిసర గ్రామాల విద్యార్థినులకు ఎంతో ప్రయోజనం ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి పనులను పూర్తి చేయించి కస్తూర్బా పాఠశాల భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

# తల్లిదండ్రులకు బాలిక అప్పగింత

- ఆర్టీసీ బస్సులో అనుమానాస్పదంగా ప్రయాణం

కామారెడ్డి టౌన్: ఆర్టీసీ బస్సులో అనుమానాస్పదంగా ప్రయాణిస్తున్న బాలికను జిల్లా బాలల పరిరక్షణ విభాగం అధికారులు సోమవారం ఆమె తల్లిదండ్రులకు అప్పగించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. బాన్సువాడ పట్టణానికి చెందిన 12 ఏళ్ల బాలిక బాన్సువాడ నుంచి కామారెడ్డి రూట్‌లో స్కూల్ డ్రెస్ బ్యాగు వేసుకుని ఉదయం 10 గంటలకు బస్సులో ఒంటరిగా ప్రయాణిస్తోంది. అదే బస్సులో ప్రయాణిస్తున్న బాలల పరిరక్షణ విభాగా సిబ్బంది ఖాలేద్ ఆమెను ప్రశ్నించగా సరైన సమాధానం ఇవ్వకపోవడంతో ఆధార్ కార్డును పరిశీలించారు. వెంటనే బాన్సువాడ పట్టణ అంగన్‌వాడీ టీచర్‌కు సమాచారం అందించి బాలికను జిల్లా బాలల పరిరక్షణ విభాగం కార్యాలయానికి తీసుకువచ్చారు. జిల్లా అధికారి జే స్రవంతి బాలికకు కౌన్సిలింగ్ ఇచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు.

## షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం

- వేర్వేరు గ్రామాల్లో ఇల్లు, గుడిసె దగ్ధం



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని బాయంపల్లి, సజ్జన్‌పల్లి గ్రామాల్లో ఆదివారం రాత్రి షార్ట్‌సర్క్యూట్ కారణంగా రెండు ఇళ్లు దగ్ధమైనట్లు మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బాలయ్య తెలిపారు. బాయంపల్లికి చెందిన కండ్లపల్లి సాయన్న ఇంట్లో వంట సామగ్రి, దుస్తులు, వ్యవసాయ పనిముట్లతో పాటు ఇతర సామగ్రి కాలిపోయి రూ.2.46 లక్షల ఆస్తి నష్టంవాటిల్లిందన్నారు. సజ్జన్‌పల్లిలోనీల పోచయ్యకు చెందిన నివాసపు గుడిసె కాలిపోవడంతో రూ.46వేల ఆస్తి నష్టం వాటిల్లినట్లు వివరించారు. పంచనామా చేసినట్లు ఆర్ఐ తెలిపారు.